సాక్షి అనకాపల్లి

మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



ఖోఖో జట్ల ఎంపిక

ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి రాష్ట్ర ఖోఖో పోటీల్లో పాల్గొననున్న జట్లను ఎంపిక చేశారు. 8లో



మెరైన్ మ్యూజియం

విశాఖ ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా భవనంలో ఆధునీకరించిన మెరైన్ మ్యూజియాన్ని కేంద్ర మంత్రి ప్రారంభించారు. 8లో



అర్జీలకు సరైన పరిష్కారం

కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 370 వినతులు వచ్చాయి. 8లో

న్యూస్‌రీల్

పసుపు, కుంకుమలతో స్వయంభువుని దివ్య స్వరూపం



చోడవరం: శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి పసుపు, కుంకుమ అలంకరణలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. వినాయకచవితి నవ రాత్రి ఉత్సవాల్లో 8వ రోజున స్వామిని ఈ రూపంలో దర్శించి, భక్తులు పులకించిపోయారు. ఉత్సవాలు మంగళవారంతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఉదయం ప్రత్యేక రథంపై మేళతాళాల మధ్య స్వామివారి తిరువీధోత్సవం నిర్వహిస్తామని, సాయంత్రం పండితుల ఆశీర్వచనం, లడ్డూ వేలం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ఆలయ ప్రధాన అర్చకుడు కొండమంచిలి చలపతిరావు తెలిపారు.

నేడు జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్

మాకవరపాలెం: స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు గేమ్స్ ఇన్‌చార్జ్ రవి సోమవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి వెయ్యి మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. అండర్–14, అండర్–17 విభాగాల నుంచి బాలురు, బాలికలకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తామన్నారు.

హరిపాలెం హైస్కూల్లో త్రో బాల్ పోటీలు

మునగపాక (అచ్యుతాపురం): హరిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అండర్–14 బాలబాలికల త్రోబాల్ పోటీలు జరుగుతాయని హెచ్ఎం రవి తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో నియోజకవర్గానికి ఒకటి వంతున బాలుర నుంచి 15 జట్లు, బాలికల నుంచి 15 జట్లు పాల్గొంటాయన్నారు.

ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

తుమ్మపాల: నిరుద్యోగ యువతకు ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 పథకం ద్వారా ఎలక్ట్రీషియన్ కోర్సులో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నాక్), రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు నాక్ సహాయ సంచాలకుడు రవికుమార్ తెలిపారు. 10వ తరగతి పాసై 15 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులను అర్హులుగా పరిగణించి, రెండు నెలల శిక్షణ అందిస్తామన్నారు. జిల్లాలోని మాకవరపాలెం నాక్ శిక్షణ కేంద్రంలో స్టేషనరీ కూడా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. 60 మందికి మాత్రమే శిక్షణ ఇస్తామన్నారు. ఎటువంటి ఫీజు చెల్లించనక్కర్లేదన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 7780275922, 9394885164 ఫోన్ నెంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

పిడుగుపడి వైఎస్సార్ సీపీ నేత మృతి



అచ్చిబాబు(ఫైల్)

చీడికాడ: పిడుగుపాటుకి గురై మాజీ ఎంపీపీ భర్త, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పోతల అచ్చిబాబు(53) సోమవారం సాయంత్రం మృతి చెందారు. సంఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తురువోలు గ్రామానికి చెందిన అచ్చిబాబు సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో తమ కళ్లాలకు సమీపంలో ఉన్న పొలంలో పశువులను మేపుతుండగా చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. దీంతో పశువులను పాకలకు తరలిస్తుండగా అచ్చిబాబు పిడుగుపాటుకు గురై అక్కడే కుప్పకూలిపోయారు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన చోడవరం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. మంచి మనిషిగా ఈ ప్రాంతంలో పేరున్న అచ్చిబాబు మృతి వార్తతో తురువోలు, తంగుడుబిల్లి, అర్జునగిరి, పెదగోగాడ, చీడిపల్లి గ్రామాల్లో విషాదం అలముకుంది. అచ్చిబాబుకు భార్య చిన్నమ్మలు, ఇద్దరు పెళ్లికాని ఆడపిల్లలు ఉన్నారు.

ఇదీ గంటా 'స్కిల్'!

తప్పుడు సర్వేలతో ముదపాక భూముల వ్యవహారంలో బండారు.. మోసపూరిత విధానంతో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తమ 'స్కిల్' కనబరిచారు. ఐటీ రిటర్న్సు కూడా దాఖలు చేయని తన సతీమణి పేరుతో ఏకంగా రూ.92 లక్షలకుపైగా నగదుతో గంటా భీమిలిలో కొనుగోలు చేసిన భూ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశమైంది. నిబంధనలకు విరుద్ధంగా భారీ నగదుతో జరిపిన లావాదేవీల్లో పేర్కొన్న పాన్ నంబర్ కూడా తేడాగా ఉండటం గమనార్హం.

- భీమిలిలో భారీ నగదుతో 1,938 చ.గ స్థలం కొనుగోలు
- భార్య పేరుతో భూ వ్యవహారం చేసినట్టు ఒప్పందం
- ఆమె పేరుతో ఐటీ రిటర్న్స్ దాఖలు చేయని వైనం
- అఫిడవిట్‌లో ఒకటి.. అగ్రిమెంటులో మరో పాన్‌కార్డు నెంబరు
- ఐటీ శాఖ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారం


సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా! అన్న చందంగా.. తెలుగుదేశం పార్టీ నేతలు తమ నాయకుడి తరహాలోనే కనికట్టు చేయడంలో ఆరితేరిపోయారు. ఒకవైపు స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో బోగస్ కంపెనీలతో కోట్లు కొట్టేసి జైలులో చంద్రబాబు ఉన్నారు. తాను తక్కువేమీ కాదన్నట్టు... భీమిలిలో తన సతీమణి పేరు మీద కొనుగోలు చేసిన భూ వ్యవహారంలో గంటా కూడా అదే తరహా 'స్కిల్' కనబరిచారు. ఆదాయపన్నుశాఖ నిబంధనలకు విరుద్ధంగా కేవలం నగదు రూపంలో రూ.92 లక్షలకుపైగా చెల్లింపులు ఆయన సతీమణి పేరు మీద చేసినట్టు లెక్కల్లో చూపారు. అయితే, ఆమె తరపున ఐటీ రిటర్న్సును ఎక్కడా దాఖలు చేయకపోవడం గమనార్హం. గంటా శ్రీనివాసరావు భీమిలి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే... భీమిలి ప్రాంతంలో 1,936 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించిన కొనుగోలు ఒప్పందంలో గంటా వ్యవహరించిన తీరు ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది.

అంతా నగదు రూపంలోనే...!

ఆదాయపన్నుశాఖ చట్ట ప్రకారం రూ. 2 లక్షలకు మించి నగదు లావాదేవీలు చేపట్టరాదు. ఈ నిబంధనలేవీ తెలియని వ్యక్తి కాదు గంటా శ్రీనివాసరావు. అయితే తన సతీమణి పేరుతో 2018లో భూముల కొనుగోలులో నగదు రూపంలోనే మెజార్టీ వ్యవహారం నడవడం విమర్శలపాలవుతోంది. అంతేకాకుండా ఆయన మంత్రిగా ఉన్న సమయంలో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఈ విధంగా జరగడం బహుశా యాదృచ్ఛికం కాకపోవచ్చు. రూ.92.98 లక్షలు కేవలం నగదు రూపంలో ఇచ్చినట్టు చూపారు. మరో రూ. 25 లక్షలను ఆర్‌టీజీఎస్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసినట్టు చూపి.. సర్వే నెంబరు.. టీఎస్ నెంబరు 1490, బ్లాక్ నెంబరు 17, వార్డు నెంబరు 24లోని 1936 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఒకవేళ ఇంత భారీ స్థాయిలో నగదు లావాదేవీలు జరిపితే పాన్‌నెంబరు పేర్కొనడంతో పాటు ఐటీ రిటర్న్సును దాఖలు చేయాల్సి ఉంటుంది. ఒకవైపు తన అఫిడవిట్‌లో గంటా శారద 2014–15 నుంచి 2018–19 మధ్య ఒక్కసారి కూడా ఐటీ రిటర్న్సు దాఖలు చేసినట్లు చూపించలేదు. మరోవైపు గంటా శ్రీనివాసరావు మాత్రం 2014–15 నుంచి ఐటీ రిటర్న్సును దాఖలు చేసినప్పటికీ 2018–19 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.30,39,338 ఆదాయంగా చూపడం గమనార్హం. ఆదాయపన్నుశాఖ సెక్షన్ 271 డి ప్రకారం... రూ. 2 లక్షలకు మించి నగదు లావాదేవీలను నిర్వహిస్తే శిక్షార్హుడు అవుతారు. ఆదాయపన్నుశాఖ సెక్షన్ 269 ఎస్‌టీ ప్రకారం అంతే మొత్తాన్ని పెనాల్టీ రూపంలో వసూలు చేసే అధికారం ఉంది.






Name	PAN	The financial year for which the last income tax return has been filed	Total income shown in Income Tax Return (in Rupees) for the last five financial years completed (as on 31st March)
Self Ganta Srinivasa Rao	ADVPG4631G	2018-19	(i) Rs.30,39,338/-
		2017-18	(ii) Rs.22,80,005/-
		2016-17	(iii) Rs.11,06,850/-
		2015-16	(iv) Rs.4,95,218/-
		2014-15	(v) Rs.0/-
Spouse G sarada	ABPPG2215A	Returns not yet filed	(i) Returns not yet filed
			(ii) Returns not yet filed
			(iii) Returns not yet filed

ATTESTED NOTARY

గంటా ఎన్నికల అఫిడవిట్‌లో తన సతీమణి గంటా శారద 2014 నుంచి 2019 వరకూ ఐటీ రిటర్న్స్ దాఖలు చేయనట్లుగా చూపించిన వైనం






Rs. 5,00,000/- Paid by way of cash
Rs. 8,00,000/- Paid by way of cash
Rs. 6,00,000/- Paid by way of cash
Rs. 5,00,000/- Paid by way of cash
Rs. 12,00,000/- Paid by way of cash
Rs. 10,00,000/- Paid by way of cash
Rs. 5,00,000/- Paid by way of cash
Rs. 8,00,000/- Paid by way of cash
Rs. 10,00,000/- Paid by way of cash
Rs. 5,00,000/- Paid by way of cash
Rs. 4,00,000/- Paid by way of cash
Rs. 6,98,000/- Paid by way of cash
Rs. 5,00,000/- Paid by way of cash
Rs. 25,00,000/- Paid by way of RTGS on

పరిమితికి మించి నగదు చెల్లింపులు చేసినట్లుగా కొనుగోలు ఒప్పంద కాపీ

రెండు పాన్‌కార్డులు ఉండొచ్చా..!



IN FAVOUR OF
Smt. GANTA SARADA, (Pan No. ABPPG 2216A), aged 50 years, W/o. Sri. Ganta Srinivasa Rao, residing at Plot no. 231, Door No. 1-84-18/1, Sector-4, MVP Colony, Visakhapatnam, herein after called the "VENDEE" which term shall mean and include her heirs, executors, administrators and assignees on the other

భూ కొనుగోలు డాక్యుమెంట్‌లో గంటా సతీమణి పేరుతో ఉన్న పాన్‌కార్డు నంబర్



Spouse G sarada	ABPPG2215A	Returns not yet filed	(i) (ii) (iii)

ఎన్నికల అఫిడవిట్‌లో గంటా సతీమణి పాన్‌కార్డ్ నంబర్

భీమిలిలో భూములు కొనుగోలు చేసిన సందర్భంలో ఆయన సతీమణి పేరు మీద పేర్కొన్న పాన్ కార్డు నెంబరు ఏబీపీపీజీ2216ఏ. అయితే, ఆయన అఫిడవిట్‌లో మాత్రం తన సతీమణి పాన్ నెంబరు ఏబీపీపీజీ2215ఏగా పేర్కొన్నారు. వాస్తవానికి ఐటీశాఖ నిబంధనల ప్రకారం రెండు పాన్ కార్డు నెంబర్లను కలిగి ఉండటం చట్టరీత్యా నేరం.

రెండు పాన్‌కార్డులు ఏ సమయంలో ఉంటాయంటే...

- అప్పటికే ఉన్న పాన్‌కార్డులో ఏవైనా తప్పులు ఉంటే... వాటిని సరిచేసుకోకుండా కొత్త దానికి దరఖాస్తు చేయడం.
- పాన్‌కార్డు కోసం పలు మార్లు దరఖాస్తు చేయడం
- పెళ్లికి ముందు ఒక పాన్‌కార్డు... పెళ్లి తర్వాత మరో పాన్‌కార్డుకు మహిళలు దరఖాస్తు చేసిన సమయంలో...
- ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొట్టే ఉద్దేశంతో అక్రమంగా రెండు పాన్‌కార్డులను కలిగి ఉండటం.

ఇందులో ఏదైనా చట్టరీత్యా నేరమే. తమకు ఉన్న రెండు పాన్‌కార్డులను వెంటనే తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఆదాయపన్నుశాఖ చట్టరీత్యా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అయితే, ఈ వ్యవహారంలో నిజంగా రెండు పాన్ కార్డులు ఉన్నాయా? ఒకే సిరీస్‌లో కేవలం నెంబరు మార్చి తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో ఈ వ్యవహారం నడిచిందా? అనేది లోతుగా విచారిస్తే మినహా తెలిసే అవకాశం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏదీ ఏమైనా తెలుగుదేశం నేతలు అవినీతి వ్యవహారంలో చూపుతున్న 'స్కిల్' మాత్రం కొంగొత్త పుంతలు తొక్కుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

- నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్
- సమీక్ష సమావేశంలో ఎస్పీ మురళీకృష్ణ



సాక్షి, అనకాపల్లి: రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ మురళీకృష్ణ ఆదేశించారు. వివిధ నేరాల్లో శిక్ష పడి బెయిల్‌పై బయట తిరుగుతూ మళ్లీ నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. రౌడీ షీట్ తెరిచి ఉన్న ప్రతి ఒక్కరినీ ప్రతీ ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీ మురళీకృష్ణ సమీక్ష నిర్వహించారు. రౌడీ షీటర్లు వివిధ నేరాలకు పాల్పడిన కేసులను సమీక్షించి అధికారులకు సూచనలు చేశారు. వివిధ నేరాల్లో శిక్ష పడి బెయిల్‌పై బయట తిరుగుతున్నవారి నడవడికపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వారి కుటుంబ నేపథ్యం, వారి జీవనాధారం వంటి వివరాలు తెలుసుకోవాలని ఆదేశించారు. దర్యాప్తు జరుగుతున్న దీర్ఘకాలిక కేసుల్లో నేరాభియోగ పత్రాలను త్వరితగతిన కోర్టులో సమర్పించి నిందితులకు బెయిల్ రాకుండా చూడాలన్నారు. బెయిల్‌పై ఉండి మళ్లీ నేరానికి పాల్పడితే బెయిల్ రద్దు చేయమని స్థానిక కోర్టును కోరాలన్నారు. అంతేకాకుండా త్వరితగతిన కఠిన శిక్షలు పడే విధంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో అనుసంధానమై పనిచేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఐ లక్ష్మణమూర్తి, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు అభినందనలు



జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్రతో ఉద్యోగులు

మహారాణిపేట: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా జె.సుభద్ర పదవి చేపట్టి దిగ్విజయంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీ రాజ్ ఎస్ఈ రవీంద్ర, ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ మహేంద్ర, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు, కార్యదర్శి సీతారామరాజు, జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి, డిప్యూటీ సీఈవో సత్యనారాయణ తదితరులు సుభద్రను పూలమాలతో సన్మానించారు. సుభద్ర మాట్లాడుతూ జెడ్పీ చైర్‌పర్సన్‌గా సహకరించిన సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

స్వయం ఉపాధి, చిన్న పరిశ్రమలకు

రుణాలు వేగవంతం

డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో బ్యాంకర్లతో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లా యంత్రాంగం ప్రతిపాదించిన చిన్న పరిశ్రమలు, స్వయం ఉపాధివర్గాలకు మంజూరు చేసే రుణాల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి బ్యాంకు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డీసీసీ(జిల్లా కన్సల్టేషన్ కమిటీ), డీఎల్ఆర్‌సీ(జిల్లా లెవెల్ రివ్యూ కమిటీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే బ్యాంకు సహాయ సహకారాలు ఉండాలన్నారు. బ్యాంకు అధికారులు మానవతా దృక్పథంతో స్వయం ఉపాధికి, సూక్ష్మ పరిశ్రమలు నిర్వహించే యువతకు రుణ మంజూరు త్వరితగతిన చేయాలన్నారు. కొన్ని బ్యాంకుల రుణ తిరస్కరణ కారణాలు సమంజసంగా లేని విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల రుణాలను కొన్ని బ్యాంకులు జాప్యం చేస్తున్నట్టు తెలిసిందన్నారు. సాంకేతిక, డాక్యుమెంట్ సమస్యలు ఉత్పన్నమైనపుడు సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సరిదిద్దవచ్చన్నారు. సూక్ష్మ పరిశ్రమలు ఎందరికో ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని, స్వయం ఉపాధి మూలంగా ఎన్నో కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్న విషయాన్ని గమనించాలన్నారు. అనంతరం 2023–24 ఆర్థిక సంవత్సర క్రెడిట్ ప్లాన్ లక్ష్యాలపై సమీక్షించారు. బ్యాంకు లింకేజీ రుణాలు, జగనన్న తోడు, పీఎం స్వనిధి, టిడ్కో గృహాల నిర్మాణం, ఫుడ్ ప్రాసెసింగ్, నాబార్డు పథకాలపై చర్చించారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, ఏజీఎం ఆర్కే హనుమకుమారి, ఖాదీ సహాయ సంచాలకులు వి.పద్మ, డీఆర్డీవో పీడీ లక్ష్మీపతి, మెప్మా పీడీ సరోజని, మత్స్యశాఖ డీడీ పి.ప్రసాద్ ఉద్యానవన శాఖాధికారి ప్రభాకరరావు, జిల్లా పశుసంవర్థక అధికారి ప్రసాదరావు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

చిత్రకళా పోటీలకు దరఖాస్తు గడువు ఈనెల 30

చోడవరం: ఆలిండియా చిల్డ్రన్ చిత్రకళా పోటీలకు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చోడవరం చిత్రకళా నిలయం నిర్వాహకుడు, ప్రముఖ చిత్రకారుడు బొడ్డేడ సూర్యానారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ ఆలిండియా చిత్రకళా పోటీలు, ప్రదర్శనను నవంబరు 4, 5 తేదీల్లో చోడవరంలో నిర్వహిస్తున్నామన్నారు. చిత్రకారులు తమ చిత్రాలను ఈనెల 30లోగా నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 8074700756 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూర్యనారాయణ కోరారు.

కేంద్రీయ విద్యాలయానికి వచ్చే నెల భూమి పూజ

- రూ.28.74 కోట్లతో భవనాల నిర్మాణం
- రైల్వే నిధులతో అండర్ బ్రిడ్జిలు, స్టేషన్ అభివృద్ధి
- ఎంపీ డాక్టర్ సత్యవతి వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ బీవీ సత్యవతి

అనకాపల్లి టౌన్: అనకాపల్లి మండలం సుందరయ్యపేట గ్రామంలో 10 ఎకరాల్లో కేంద్రీయ విద్యాలయం భవనాల నిర్మాణానికి వచ్చే నెలలో భూమిపూజ నిర్వహించనున్నట్లు ఎంపీ బీవీ సత్యవతి తెలిపారు. స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కొత్త జిల్లా అనకాపల్లిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ఆమోదం రావడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకు అవసరమైన భవనాలను జీ+2 తరహాలో నిర్మించేందుకు రూ.28 కోట్ల 73 లక్షల 96 వేల నిధులతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. కేంద్రీయ విద్యాలయం స్కూల్ భవనానికి రూ.10 కోట్ల 90 లక్షలు, ఉపాధ్యాయుల భవనాలకు రూ.3 కోట్ల 29 లక్షలు, క్యాంటీన్‌కు రూ.5 లక్షల 72 వేలు, గార్డు రూమ్‌కు రూ.లక్ష 4 వేలు, విద్యాలయం చుట్టూ ప్రహరీగోడ నిర్మాణానికి రూ.కోటి 95 లక్షలు, ఇతర మౌలిక సదుపాయాలకు రూ.5 కోట్ల 79 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థులకు వివిధ క్రీడల్లో నైపుణ్యం పెంచేందుకు అవసరమైన ఆట స్థలాలను రూ.4 కోట్ల 77 లక్షలతో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. శంకుస్థాపన చేసిన 10 మాసాల్లో భవన నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. రానున్న విద్యా సంవత్సరం నుంచే తరగతులు నిర్వహించేందుకు వీలుగా ఈ విజయదశమి నుంచి పట్టణంలోని జీవీఎంసీ ఉడ్‌పేట పాఠశాల ఆవరణలో కేంద్రీయ విద్యాలయ కార్యకలాపాలు ప్రారంభిస్తామన్నారు. ఒక్కో తరగతి గదికి 40 మంది విద్యార్థులతో తొలుత 1 నుంచి 5వ తరగతుల వరకు ప్రవేశాలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. తర్వాత దశల వారీగా తరగతులను అప్‌గ్రేడ్ చేయనున్నట్లు తెలిపారు.

దొంగగెడ్డ రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జికి చర్యలు

అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ పరిధి దొంగగెడ్డ రైల్వే అండర్ బ్రిడ్జి, పరవాడ మండలం లంకెలపాలెం రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు ఎంపీ తెలిపారు. ఈ రెండింటినీ కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించేందుకు డీపీఆర్ సిద్ధం చేసినట్లు చెప్పారు. వీటి నిర్మాణానికి రైల్వే జోనల్ మేనేజర్ ఆధ్వర్యంలో రైల్వే బోర్డు బడ్జెట్ నుంచి నిధులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

రూ.27 కోట్లతో అనకాపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి

అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అనకాపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధికి గతంలో రైల్వేశాఖ రూ.27 కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. రూ.7 కోట్లతో గూడ్స్‌షెడ్ నుంచి 2, 3 ప్లాట్‌ఫాం పైకి ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణపనులు జరుగుతున్నాయన్నారు. రెండు రోజుల క్రితం స్టేషన్‌లో ఆధునిక సౌకర్యాలతో కూడిన సులాభ్ కాంప్లెక్స్‌లు, స్టేషన్‌కు వచ్చే వీఐపీలకు ప్రత్యేక వసతుల్లో భాగంగా నూతన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మృగవేట



గజ వాహనంపై వేంకటేశ్వరస్వామికి తిరువీధి సేవ

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మృగవేట కార్యక్రమం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం కొండపై కల్కి అవతారంలో వెలసిన స్వామివారికి పంచామృతాభిషేకం, నిత్యార్చనలు పూర్తి చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కొండ దిగువ క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, ఆండాళ్లమ్మవారి సన్నిధిలో నిత్యపూజలు చేసిన అనంతరం పల్లకిలో సుదర్శన పెరుమాళ్లను ఉంచి గ్రామ బలిహరణలు పూర్తి చేశారు. సాయంకాలారాధనలో భాగంగా ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామిని గజవాహనంలో బంధుర సరస్సు వద్ద ఉన్న లంకవారి మండపం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థగోష్ఠి, అనంతరం గ్రామ తిరువీధి సేవ జరిగింది. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు, ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు సంకర్షణపల్లి రాజగోపాల కృష్ణమాచార్యులు, పీసపాటి వెంకట శేషాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.



బంధుర సరస్సు సమీపంలోని లంక మండపం వద్ద మృగవేట కార్యక్రమం

ఏసీబీ వలలో వీఆర్వో

- పట్టాదార్ పాస్ పుస్తకం పేరు మార్పునకు లంచం డిమాండ్
- సొమ్ము తీసుకుంటుండగా వల పన్ని పట్టుకున్న అధికారులు



వివరాలు తెలుపుతున్న ఏసీబీ డీఎస్పీ రమ్య

నాతవరం: పట్టాదార్ పాస్ పుస్తకాల కోసం లంచం తీసుకుంటున్న వీఆర్వోను ఏసీబీ అధికారులు సోమవారం వల పన్నిపట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమ్య విలేకరులకు తెలిపిన వివరాలు.. మండలంలో పి.కె.గూడెం గ్రామానికి చెందిన రెడ్డి సన్యాసినాయుడు తన తండ్రి రాజుబాబు మరణించడంతో.. తన తండ్రి పేరు మీద ఉన్న భూమి పాస్‌పుస్తకాలను తల్లి పేరు మీద మార్పు చేయాలని వీఆర్వో పి.సత్యనారాయణను సంప్రదించాడు. మ్యుటేషన్ చేయడానికి, పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇప్పించడానికి రూ.4 వేలు ఇవ్వాలని వీఆర్వో డిమాండ్ చేశాడు. వీఆర్వోకు ముందుగా బాధితుడు రూ.2 వేలు ఫోన్ పే చేశాడు. మరో రెండు వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో బాధితుడు 14400 నంబరు ఏసీబీ కాల్ సెంటరును ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అడిషనల్ ఎస్పీ శ్రావణి ఆధ్వర్యంలో ఆదివారం దాడులు చేశామని డీఎస్పీ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్వో సత్యనారాయణకు బాధితుడు రెడ్డి సన్యాసినాయుడు రూ.2 వేలు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామన్నారు. ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేసి కేసు నమోదు చేశామని, నిందితుడిని అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నామన్నారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు కిశోర్‌కుమార్, ప్రేమ్‌కుమార్, శ్రీను ఎస్ఐలు సురేష్, మనోజ్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.20 వేలు డిమాండ్ చేశాడు..

తన తండ్రి పేరు మీద ఉన్న భూమిని తల్లి పేరు మీద మార్పు చేయాలని చాలా రోజులుగా వీఆర్వో సత్యనారాయణ చుట్టూ తిరుగుతున్నానని బాధితుడు రెడ్డి సన్యాసినాయుడు తహసీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులకు తెలిపాడు. భూమి మార్పు చేయడానికి వీఆర్వో రూ.20 వేలు డిమాండ్ చేశాడని చెప్పాడు. ముందుగా రూ.10 వేలు నగదు రూపంలో, రూ.2 వేలు ఫోన్ పే ద్వారా చెల్లించానన్నాడు. పని చేయకుండా జాప్యం చేస్తున్నాడని విసుగు చెంది ఏసీబీ అధికారులను ఆశ్రయించానన్నాడు. ఏసీబీ అధికారులు రూ.10 వేలు ఇచ్చినట్టు ఆధారం అడిగారని, తాను చూపలేకపోవడంతో పరిగణనలోకి తీసుకోలేదని చెప్పాడు. వారు అందించిన రూ.2 వేల నగదును ఈరోజు ఇస్తుండగా వల పన్ని పట్టుకున్నారని చెప్పాడు.



ఏసీబీని ఆశ్రయించిన సన్యాసినాయుడు



పట్టుబడిన వీఆర్వో సత్యనారాయణ

క్లుప్తంగా

సర్పంచ్‌పై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు

రావికమతం: చీమలపాడు సర్పంచ్ ఒంజరి గంగరాజుపై దాడి చేసిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు కొత్తకోట ఎస్‌ఐ విభీషణరావు సోమవారం తెలిపారు. గంగరాజు ఆదివారం సాయంత్రం ములకలాపల్లి వెళ్తుండగా చీమలపాడు దాటిన తర్వాత ఎదురుగా బైక్‌పై అతివేగంతో వస్తున్న ఇద్దరు కిత్తంపేట వ్యక్తులను ర్యాష్ డ్రైవింగ్ వద్దని సూచించడంతో వారు సర్పంచ్‌తో గొడవ పెట్టుకుని దాడి చేశారని ఎస్‌ఐ తెలిపారు.

రామాలయానికి రూ.1.50 లక్షల విరాళం



నాగులాపల్లి రామాలయం నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక: నాగులాపల్లి రామాలయం నిర్మాణానికి దాతలు ముందుకొస్తున్నారు. సోమవారం నాగులాపల్లికి చెందిన మళ్ల సూర్య అప్పారావు జ్ఞాపకార్థం భార్య రాజేశ్వరి, కుమారులు జగదీష్, సురేష్, కోడళ్లు లక్ష్మి, దేవిలు రూ.లక్షా 50వేలను నిర్వాహకులకు విరాళంగా అందజేశారు. మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు, ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సింహగిరిపై రెండో రోజు పవిత్రోత్సవాలు



అప్పన్న ఉత్సవమూర్తులు చెంతన వేద పఠనాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్వామివారిని వేద పఠనాలతో అర్చకులు కొలిచారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై వేంజేపచేశారు. నాలుగు వేదాలతో స్వామిని కొలిచారు. కల్యాణ మండపంలోనే హోమగుండం వద్ద విశేష హోమాలు, రాత్రి అదివాస పూజలు నిర్వహించారు.

స్పందన అర్జీలకు సరైన పరిష్కారం

- స్పందనపై ప్రజల్లో నమ్మకం కలిగించాలి
- అధికారులకు కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి ఆదేశం
- కలెక్టరేట్‌లో 370 అర్జీల స్వీకరణ

తుమ్మపాల: స్పందన అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరించాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు నమ్మకంతో చేసుకున్న అర్జీలకు సరైన రీతిలో పరిష్కరించాలని లేనిచో పునరావృతం అవుతాయన్నారు. పరిష్కారం జరిగిన సమస్యకు మరలా ఫిర్యాదు చేసే అవకాశం లేదన్నారు. గ్రామ స్థాయిలో కొన్ని అర్జీలు పరిష్కారం లేకుండానే క్లోజ్ చేస్తున్నారన్నారు. కలెక్టర్ కార్యాలయం నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం సమస్యల పరిష్కారంపై నేరుగా అర్జీదారులకే ఫోన్ చేసి సమాచారం (ఫీడ్‌బ్యాక్) తీసుకుంటున్నారని, పరిష్కారం కాకుండా క్లోజ్ చేసిన సమస్యలను రీఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం పట్ల ప్రజలకు మరింత నమ్మకాన్ని అందించాలన్నారు. మొత్తం 370 అర్జీలు స్పందన కార్యక్రమంలో నమోదు కాగా జేసీ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి అర్జీలను స్వీకరించారు.

చేదోడు పథకానికి దరఖాస్తు తీసుకోవడం లేదు..

మహిళలకు చేయూత ఇస్తూ వృత్తి పనులకు అందించే వైఎస్సార్ చేదోడు పథకానికి అర్హత ఉన్నప్పటికీ దరఖాస్తు స్వీకరించకుండా ఇబ్బందులు పెడుతున్నారని అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెం పంచాయతీకి చెందిన టైలర్లు నారపిన్ని దేవి, సాలాపు నూకమ్మ సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేశారు. తాము గ్రామంలో పదేళ్లుగా టైలరింగ్ వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని, టైలరింగ్ షాపు నిర్వహణపై ప్రభుత్వం ధ్రువీకరణ పత్రాలు కూడా మంజూరు చేసిందని, రెండేళ్లుగా పథకాన్ని పొందుతున్న తమను వ్యక్తిగతంగా ఇబ్బందులు పెడుతూ ఈ ఏడాది అనర్హులంటు దరఖాస్తు స్వీకరించడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు వైఎస్సార్ చేదోడు పథకంలో అర్హత కల్పించాలని కోరారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

కాంట్రాక్టు సిబ్బంది నిరసన

సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్ట్ సిబ్బందిని క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఎంఎస్ కోఆర్డినేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఐఈఆర్‌పీలు, సీఆర్‌పీలు, కేజీబీవీ టీచర్లు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. 13 సంవత్సరాలుగా విద్యాశాఖలో పనిచేస్తున్న తమను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు క్రమబద్ధీకరణ చేయాలని కోరారు.

జీపీఎస్ వద్దంటూ వినతి

ప్రభుత్వం ఉద్యోగుల పట్ల అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్న జీపీఎస్‌ను వ్యతిరేకిస్తూ ఎఫ్ఏపీటీవో, ఏపీసీపీఎస్‌ఈఏ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలెక్టరేట్ వద్ద నిరసన చేశారు. సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఓపీఎస్‌కు బదులు జీపీఎస్‌ను తీసుకొచ్చి ఉద్యోగులను మోసం చేస్తున్నారని ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు రొంగలి అప్పలరాజు, ఎఫ్ఏపీటీవో జిల్లా చైర్మన్ గొంది చినబ్బాయి, వై.సుధాకర్, ఎన్.సన్యాసినాయుడు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

ఎస్పీ కార్యాలయానికి 52 అర్జీలు

అనకాపల్లిటౌన్: ఎస్పీ కార్యాలయానికి సోమవారం స్పందనకు 52 అర్జీలు వచ్చినట్లు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటూ, చట్టపరిధిలో సమస్యలను పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్ వంటి సమస్యలపై అర్జీలు ఎక్కువగా వచ్చినట్టు పేర్కొన్నారు. చట్టపరిధిలో సమస్యలు త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని దిగువస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, ఎస్‌ఐ వెంకన్న పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

విద్యుత్ చౌర్యం చేస్తే కేసుల నమోదు

విద్యుత్ శాఖ విజిలెన్స్ ఏడీ సుబ్రహ్మణ్యం

నాతవరం: అనుమతులు లేకుండా నిబంధనలు ఉల్లఘించి విద్యుత్ చౌర్యం చేస్తే కేసులు నమోదు చేస్తామని విద్యుత్ శాఖ విజిలెన్స్ ఏడీ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలో పి.కె.గూడెం, గునుపూడి, నాతవరం గ్రామాల్లో విద్యుత్ వినియోగదారుల ఇళ్లు, రైస్ మిల్లులుపై సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం నాతవరం సబ్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నర్సీపట్నం డివిజన్‌లో పలు గ్రామాల్లో ఆకస్మికంగా దాడులు నిర్వహించామన్నారు. నిబంధనలు ఉల్లఘించి విద్యుత్ వాడే వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. మండలంలో తాము నిర్వహించిన దాడుల్లో అవకతవకలు కానరాలేదన్నారు. అధికంగా వినాయక చవితితోపాటు వివిధ పండగలు సమయంలో విద్యుత్ చౌర్యం చేస్తున్నారన్నారు. ఇటీవల అధిక విద్యుత్‌పై విజిలెన్సు దాడులు చేయడంతో అక్రమాలు తగ్గుముఖం పట్టాయన్నారు. విద్యుత్ సబ్ స్టేషన్ల మెయింటెన్స్‌పై తనిఖీలు నిర్వహిస్తామన్నారు. సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు చేశామన్నారు. నాతవరం విద్యుత్ శాఖ జేఈ చంద్రమౌళి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ విజిలెన్సు ఏడీ సుబ్రహ్మణ్యం

అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు

అసెంబ్లీలో ఎమ్మెల్యే బాబూరావు



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: దళారుల ప్రమేయం లేకుండా అవినీతికి తావు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తోందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సోమవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిందన్నారు. వారందరికీ ఇళ్లు మంజూరు చేసి నిర్మాణానికి రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందజేస్తోందన్నారు. అయితే కొంతమంది పేదలకు అది సరిపోవడం లేదని, పునాదులు, లింటెల్ లెవల్ వరకు నిర్మించి అసంపూర్తిగా వదిలేస్తున్నారన్నారు. అదనంగా మరో రూ.20 వేల నుంచి 30 వేలు ఇస్తే బాగుంటుందని, ప్రభుత్వం దీనిపై ఆలోచన చేయాలని కోరారు. జగనన్న విద్యాదీవెన పథకం కింద ఇస్తున్న ఆర్థిక సాయం కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అందుతోందని, అర్హత గల వారు మరొకరు ఉంటే వారికీ వర్తింపజేయాలని కోరారు.

జేజేఎం కేంద్ర బృందం ఆకస్మిక తనిఖీ



అర్ల పాఠశాలలో కుళాయి, పైపులైను పనులు పరిశీలించిన జల్‌జీవన్ మిషన్ కేంద్ర బృందం

రోలుగుంట: ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగు నీరు అందించేందుకు ప్రవేశపెట్టిన జల్‌జీవన్ మిషన్ పథకం అమలు తీరును పరిశీలించేందుకు ఆ శాఖ కేంద్ర బృందం సభ్యులు సుశీల్‌కుమార్ చౌబే, ఈశ్వర్‌చంద్ జైన్ సోమవారం రోలుగుంట వచ్చారు. అర్ల గిరిజన పంచాయతీలో ఈ పథకం ద్వారా చేపట్టిన పనులను తనిఖీ చేశారు. ఈ పథకం కింద పంచాయతీకి రూ 20 లక్షలు మంజూరు కాగా నిధులకు తగ్గట్టు పనులు జరిగాయా లేదా, పంచాయతీలో ఎన్ని గృహాలు ఉన్నాయి... ఎన్ని కుళాయిలు ఏర్పాటు చేశారో పరిశీలించారు. పైపులైన్ పనుల నాణ్యతను పరిశీలించారు. గ్రామంలో 71 ఇళ్లకు 71 కుళాయిల ఏర్పాటు, పాఠశాలకు, అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన చోట కలిపి మరో ఐదు కుళాయిలతో కలిపి 76 ఏర్పాటు చేసినట్టు తెలుసుకున్నారు. గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఏవిధంగా తాగునీరు సరఫరా అవుతుంది, సరఫరాపై పూర్తి స్థాయిలో సంతృప్తి చెందుతున్నారా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పథకం కింద జరిగిన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఏ ఒక్కరికీ తాగునీటి సమస్య ఏర్పడకుండా చూడడమే పథకం ఉద్దేశ్యమని, దీనిని చిత్తశుద్ధితో అమలు చేయాలని హౌసింగ్ ఏఈ, రాజు, సిబ్బంది రమణ,లక్ష్మణ, దొరబాబుకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ వండల వనిత, రాజు పాల్గొన్నారు.



మంచినీటి పథకం పరిశీలించి వస్తున్న ఈశ్వర్‌చంద్ జైన్

ఇంటింటి కుళాయిల బాధ్యత శానిటేషన్ కమిటీదే..

కశింకోట: జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తున్నారని, దీన్ని సమర్థంగా నిర్వహించే బాధ్యతను గ్రామ శానిటేషన్ కమిటీయే తీసుకోవాలని జల్‌జీవన్ మిషన్ నిపుణుడు ఈశ్వర్‌చంద్ జైన్ కోరారు. పేరంటాలపాలెం రెవెన్యూ గ్రామంలో శత శాతం జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో 224 ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేసి నీటి సరఫరా చేపట్టారు. జేజేఎం కేంద్ర బృందం సభ్యులు జైన్‌తో పాటు సుశీలకుమార్ చౌబే బృందం ఈ పథకాన్ని సోమవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. కుళాయి నీరు సరఫరా అవుతున్న తీరు, నీటి ట్యాంకు పరిశుభ్రత, బోర్ల ఏర్పాటు, పైపులైన్‌ల ఏర్పాటు, స్వఛభారత్‌లో నిర్మించిన మరుగుదొడ్లను బృందం పరిశీలించింది. ఇంటింటి కుళాయిల నీటి సరఫరా తీరుపై ప్రజలను కూడా ఆరా తీశారు. అనంతరం గ్రామ ప్రజలు, శానిటరీ కమిటీతో సమావేశమయ్యారు. నెలకు ఒకసారి శానిటరీ కమిటీ సమావేశమై పరిశుభ్రత పాటించి ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉప సర్పంచ్ వజ్రం నాగశ్రీను, ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పావని, పంచాయతీ కార్యదర్శి సంజయ్‌రాణి, వార్డు సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గర్నికంలో సినిమా షూటింగ్ సందడి

రావికమతం: గర్నికం బాలచెంచమ్మతల్లి ఆలయం వద్ద సోమవారం ప్రొడక్షన్ ఎస్ఏ పేరుతో సినిమా షూటింగ్ జరిగింది. గర్నికం గ్రామస్తుడు కేశంశెట్టి సాయి శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు ఆ గ్రామంలోని బాలచెంచమ్మతల్లి ఆలయం వద్ద 'మణికంఠ అంటేనే మరణ మృదంగంరా' అనే మహూర్తపు షాట్ చిత్రీకరించారు. మాడుగుల, రావికమతం ప్రాంతాల్లో ఈ సినిమాను ఎక్కువగా చిత్రీకరిస్తామన్నారు. జయమ్మ పంచాయతీ హీరో దినేష్‌కుమార్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నట్టు దర్శకుడు సాయిశ్రీనివాస్ తెలిపారు. సాయిశ్రీనివాస్‌కు బిగ్‌స్క్రీన్‌పై సినిమాకు దర్శకత్వం వహించడం ఇదే తొలిసారి. గతంలో మణికర్ణికపురం, అమృత, సారీ సిస్టర్ పేరుతో షార్ట్‌ఫిల్మ్‌లు తీశారు. యూట్యూబ్‌లో వీటికి మంచి ఆదరణ లభించింది. ఇంకా పేరుపెట్టని ఈ సినిమా పౌరాణికం, సాంఘికం, పల్లె ప్రాంత జీవనంతో కూడిన భక్తిరస ఇతివృత్తాన్ని కథగా తీసుకున్నామని సాయిశ్రీనివాస్ తెలిపారు. ఇతర పాత్రలలో నటీ నటుల పేర్లను త్వరలో వెల్లడిస్తామన్నారు.



బాలచెంచమ్మ తల్లి ఆలయం వద్ద ముహూర్తపు షాట్లు చేస్తున్న నిర్వాహకులు

సత్యవరంలో సినిమా సందడి

మాడుగుల: మోహన్‌క్రిష్ణ ప్రొడక్షన్స్ అమ్మా క్రియేషన్ బ్యానర్‌పై సోమవారం రాత్రి సినిమా షూటింగ్ మండలంలోని సత్యవరం గ్రామంలో ప్రారంభించారు. అచ్చమైన పల్లెటూరు వాతావరణంలో సహజ సిద్ధమైన కొండల నడుమ సుమారు 20 రోజుల పాటు షూటింగ్ జరగనుందని, డైరెక్టర్ సాయిశ్రీనివాస్, మణికంఠ తెలిపారు. నూతన హీరో దినేష్, హీరోయిన్ దియారాజ్‌లు చిత్రంలో నటించనున్నారన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన బాలుడు జువనైల్ కోర్టుకు

రావికమతం: జెడ్.కొత్తపట్నం గ్రామంలో వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడిన మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకుని విశాఖ జువనైల్ కోర్టుకు తరలించామని కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ సోమవారం తెలిపారు. ఆ గ్రామంలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై శనివారం రాత్రి బాలుడు లైంగిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే.

ఫ్యాషన్ అండ్ గార్మెంట్స్ మేకింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మునగపాక(అచ్యుతాపురం): బ్రాండెక్స్ అపెరల్ ఇండియా సహకారంతో ఫ్యాషన్ అండ్ గార్మెంట్స్ మేకింగ్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రశాంతి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కోర్సుకు సంబంధించి చివరి నాలుగు నెలల పాటు స్టైఫండ్‌తో పాటు ఉద్యోగ, శిక్షణ అవకాశాలు ఉంటాయన్నారు. కోర్సు పూర్తయిన తర్వాత ప్రతిభ చూపిన విద్యార్థులకు ఖాళీల ఆధారంగా బ్రాండెక్స్ అపెరల్ పార్కులో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ ఆఖరుగా పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8185066061 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు 20 మంది ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు

మునగపాక(అచ్యుతాపురం): రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు 10 మంది బాలురు, మరో 10 మంది బాలికలు ఎంపికయ్యారని జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొంప నరసింహ నాయుడు తెలిపారు. అచ్యుతాపురం మండలం నునపర్తిలో ఆదివారం అండర్ -16 బాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. 120 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా చక్కని ప్రతిభ చూపిన 20 మంది బాల బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఈ నెల 30, అక్టోబర్ 1, 2 తేదీల్లో కర్నూలు జిల్లా నంద్యాల దరి మహానందిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సంఘ చైర్మన్, రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరావు, జిల్లా అధ్యక్షుడు ప్రభూజీ, క్లబ్ చైర్మన్ నగేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శంకరరావు, ప్రకాష్, సంఘ కార్యవర్గ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి రెజ్లింగ్‌లో బ్రాంజ్ మెడల్ సాధించిన విద్యార్థితో హెచ్‌ఎం నారాయణ

రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన పాములవాక విద్యార్థి

కోటవురట్ల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటుతున్నారు. పాములవాక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కన్నూరు గణేష్ రెజ్లింగ్ పోటీలో ప్రతిభ చూపి మండలానికి కీర్తిని తీసుకొచ్చాడు. విజయవాడ నున్న జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీ 62 కిలోల విభాగంలో గణేష్ రాణించి బ్రాంజ్ మెడల్ సాధించాడు. గణేషను హెచ్‌ఎం కె.వి.లక్ష్మీనారాయణ, పీడీ అచ్యుతరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

అందుబాటులోకి మెరైన్ మ్యూజియం!

- ప్రారంభించిన కేంద్ర మత్స్యశాఖ మంత్రి రూపాల
- అనంతరం వాణిజ్య, ఆక్వా ప్రతినిధులతో సమావేశం

సాక్షి, విశాఖపట్నం: విశాఖ బీచ్‌రోడ్డులో ఉన్న ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఐ) భవనంలో ఆధునీకరించిన మెరైన్ మ్యూజియాన్ని కేంద్ర మత్స్యశాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా సోమవారం ప్రారంభించారు. ఈ మ్యూజియంలో అరుదైన 250 రకాల మత్స్య జాతులను ప్రదర్శనకు ఉంచారు. వీటిని మంత్రి పరిశీలించారు. ఆయా జాతుల ప్రత్యేకతలను, ఏఏ ప్రాంతాలు, దేశాల సముద్ర జలాల్లో ఇవి లభ్యమవుతాయో ఎఫ్‌ఎస్‌ఐ అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం కేంద్ర మంత్రి మత్స్య పరిశ్రమ, సీఐఐ, చాంబరాఫ్ కామర్స్, ఆక్వా ఎగుమతుల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి వివిధ అంశాలు, సమస్యలను తీసుకెళ్లారు. ఈక్వెడార్.. వివిధ దేశాలకు తక్కువ ధరకే మత్స్య ఉత్పత్తులను ఎగుమతి చేస్తోందని, దీని ప్రభావం మన మత్స్య ఎగుమతులపై తీవ్రంగా పడుతోందని సీఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పవన్ చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంటుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. దేశ జనాభా చైనాకంటే అధికంగా ఉన్నప్పటికీ చేపల వినియోగం ఆ దేశంకంటే తక్కువగా ఉందని, వీటి వినియోగం పెరిగేలా చర్యలు చేపట్టాలని మరో ప్రతినిధి సూచించారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డును హైదరాబాద్ నుంచి విజయవాడకు గాని, విశాఖకు గాని మార్చాలని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి శ్రీనాథ్ విజ్ఞప్తి చేశారు. ఎగుమతుల్లో ప్రోత్సాహకాలు పెంచాలని, ఆక్వా మేత ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సీఐఐ ప్రతినిధి కోరారు. ఈ ప్రతినిధుల సూచనలు, అభ్యర్థనలను పరిశీలిస్తానని కేంద్ర మంత్రి రూపాలా హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, ఎఫ్‌ఎస్‌ఐ డీజీ జయ భాస్కరన్, విశాఖ ఎఫ్‌ఎస్‌ఐ మెకానికల్ మెరైన్ ఇంజనీర్ భామిరెడ్డి, శాస్త్రవేత్త ప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విజయ, ఇతర అధికారులు, ఆక్వా రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.



మెరైన్ మ్యూజియంను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రూపాలా

కట్న వేధింపులపై కేసు నమోదు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో కట్నం కోసం భార్యను వేధిస్తున్నారనే అభియోగంపై భర్త, అత్తమామలపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎ. ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను వివరించారు. మండలంలోని నరసింగబిల్లికి చెందిన కొమరవోలు పరదేశికి విశాఖలోని ఏవీఎన్ కళాశాల వద్ద రెల్లి వీధికి చెందిన దుర్గా భవాని(34)కి పదేళ్ల క్రితం పెద్దలు కుదిర్చిన వివాహం అయింది.

వారికి ఇద్దరు పిల్లలు సంతానం కలిగారు. ఈ నేపథ్యంలో రెండు నెలలుగా కట్నం కోసం వేధిస్తున్నారని భర్త పరదేశి, అత్త కాసులమ్మ, మామ రాములుపై దుర్గా భవాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఉత్సాహంగా జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

15 నియోజకవర్గాల నుంచి 900 మంది క్రీడాకారుల హాజరు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో విశాఖ ఉమ్మడి జిల్లాల నుంచి రాష్ట్ర ఖోఖో పోటీల్లో పాల్గొననున్న జట్లను ఎంపిక చేశారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం, 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖోఖో అండర్ 14, 17 (బాలురు, బాలికల) విభాగాల్లో పోటీలు నిర్వహించి ఎంపిక ప్రక్రియ చేపట్టారు. 15 నియోజకవర్గాల నుంచి 900 మంది క్రీడాకారులు పాల్గొని సత్తా చాటారు. ప్రతిభ ఆధారంగా రాష్ట్ర ఖోఖో పోటీల్లో పాల్గొననున్న వారిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు సరైన ప్రాధాన్యమివ్వాలని సూచించారు. క్రీడా స్ఫూర్తితో ఆటల్లో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల బాలబాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కోలాటం, లెజిమ్స్, పిరమిడ్స్, డంబుల్స్‌తోపాటు వివిధ నృత్య ప్రదర్శనలు అబ్బురపర్చాయి. ముందుగా డీఈవో, ఇతర అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభించారు. శాంతి కపోతాలు, బెలూన్లు ఎగురవేశారు. క్రీడా జ్యోతిని వెలిగించారు. తర్వాత క్రీడా కోర్టు ప్రారంభించారు. సాయంత్రం పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏడీ రవిబాబు, వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి దివాకర్, లంకెలపాలెం హైస్కూల్ హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మీనాయుడు, మాజీ సర్పంచ్ కర్రి రామజోగినాయుడు, సుందరపు అప్పారావు, ఎస్‌జీఎఫ్ అనకాపల్లి, విశాఖ జిల్లా కార్యదర్శులు ఎం.వి.నాగేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎం.నాయుడు, కిరణ్, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి ఎ.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



డీఈవో వెంకటలక్ష్మమ్మను సత్కరిస్తున్న ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు



హోరాహోరీగా సాగుతున్న ఖోఖో పోటీ

క్లుప్తంగా

రేపు అనకాపల్లికి ఉక్కు పరిరక్షణ యాత్ర



ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కరపత్రాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

కశింకోట: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించరాదని సీపీఎం నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో కశింకోటలో సోమవారం యువకులకు కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉక్కు పరిశ్రమ ప్రభుత్వ రంగంలో ఉండాల్సిన అవశ్యకతను వివరించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కారు చౌకగా స్టీల్‌ప్లాంట్‌ను అప్పగించి, ఉద్యోగులకు తీరని నష్టం కలిగిస్తోందని ఆరోపించారు. దీన్ని ప్రైవేటుపరం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ఉక్కు ప్రైవేకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉక్కు పరిరక్షణ యాత్ర నిర్వహిస్తున్నారని, ఈ నెల 27న ఈ యాత్ర అనకాపల్లి చేరుకుంటుందన్నారు. ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ విద్యార్థులు, యువత యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మెగా నేత్ర వైద్య శిబిరం రేపు

కశింకోట: మండలంలోని పేరంటాలపాలెం గ్రామ శివారు జోగారావుపేటలో ఈ నెల 27న ఉదయం 9.30 గంటల నుంచి ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సమరసత సేవా సంఘం కన్వీనర్ మండపల్లి శివ తెలిపారు. శిబిరంలో రోగులను పరీక్షించి చికిత్సలు అందిస్తారన్నారు. కంటి రోగులు తమతోపాటు ఆధార్ కార్డు తీసుకు రావాలని సూచించారు.

నరసింగబిల్లి పీఏసీఎస్ సమావేశం రేపు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సర్వ సభ్య సమావేశం ఈ నెల 27న మధ్యాహ్నం 3 గంటలకు సంఘ ఆవరణలో జరగనుందని సంఘ సీఈవో నక్కా అచ్చియ్యనాయుడు తెలిపారు. సంఘ చైర్‌పర్సన్ గండి నాయుడుబాబు అధ్యక్షతన జరిగే సమావేశంలో 2023–24 అంచనా బడ్జెట్, గడచిన ఏడాది వాస్తవ బడ్జెట్, ఆడిట్ నివేదిక ఆమోదంపై చర్చించనున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు సంఘ పరిధిలోని ఇతర సమస్యలపై చైర్‌పర్సన్ అనుమతితో చర్చ జరుగుతుందన్నారు. సంఘ సభ్యులు సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

ఆలయ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



కొత్త పాలక వర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఆలయ ఈవో ఆదినారాయణ

అనకాపల్లిటౌన్: అనకాపల్లి సుంకరమెట్ట సత్యనారాయణ, సూర్యనారాయణస్వామి దేవస్థానం చైర్మన్‌గా కర్రి మహాలక్ష్మినాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కమిటీ పాలకవర్గ సభ్యులుగా ఎస్.చంద్రశేఖర్, పి.అప్పలనాయుడు, టి.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, టి.నాగలక్ష్మి, వి.ముకుందరావు, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఎం.విద్యాసాగర్‌లతో ఆలయ ఈవో ఆదినారాయణ రెడ్డి బాధ్యత స్వీకరణ చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 76 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–14 యూనిట్లు, బీ పాజిటివ్–34 యూనిట్లు, ఓ పాజిటివ్–25 యూనిట్లు, ఏబీ పాజిటివ్–3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

అనకాపల్లి సినిమాలు

7/జీ బృందావనకాలనీ(మార్నింగ్, సెకండ్‌షో)
వారెవ్వా జతగాళ్లు(మధ్యాహ్నం- సాయంత్రం) : రాజా
మార్క్ ఆంటోని : సత్యనారాయణస్క్రీన్-1
కలివీరుడు : సత్యనారాయణస్క్రీన్-2
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి : షిర్డిసాయి
జవాన్ : పర్తిసాయి
జవాన్ : వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్ : శ్రీసత్య
ఎక్స్‌పెండబుల్స్4 : రామచంద్ర

ఇంటింటా జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజారోగ్యమే పరమావధిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇప్పటికే ఆరోగ్యశ్రీ, 104, 108 తదితర పథకాలతో ఆరోగ్య సేవలందిస్తున్న ప్రభుత్వం ఇపుడు ఇంటింటా ఆరోగ్య సర్వేకు శ్రీకారం చుట్టింది. అవగాహనారాహిత్యంతో రోగాల బారిన పడి ఎవరూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.



హౌసింగ్ కాలనీలో రక్తపరీక్ష చేస్తున్న సిబ్బంది



విసన్నపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మహిళలకు అవగాహన కలిగిస్తున్న తాళ్లపాలెం పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది

- ప్రతి ఒక్కరికీ ఏడు రకాల ప్రాథమిక పరీక్షలు
- వైద్యం అవసరమైన వారికి టోకెన్ల జారీ

కశింకోట: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మండలంలో ముమ్మరంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, కొత్తూరు, పిసినికాడ సచివాలయాలు, తాళ్లపాలెం పీహెచ్‌సీ పరిధిలోని జమాదులపాలెం, ఉగ్గినపాలెం, చింతలపాలెం సచివాలయాల పరిధిలో సర్వే నిర్వహిస్తున్నారు. ముందుగా గ్రామ వలంటీర్లు సర్వే నిర్వహించిన అనంతరం పీహెచ్‌సీకి చెందిన మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు కలిసి ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య ప్రజల ఆరోగ్య పరిస్థితిపై నిర్ధారణకు అవసరమైన ఏడు పరీక్షలు నిర్వహిస్తున్నారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలు, యూరిన్ వంటి ప్రాథమిక పరీక్షలు చేస్తున్నారు. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహిస్తారు. వీరిలో దీర్ఘ కాలిక వ్యాధులు ఉన్న వారిని తొలుత ఈ నెల 30న జమాదులపాలెంలోను, వచ్చే నెల 3న కశింకోటలోని బాలికల హైస్కూల్లోను నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి రావాల్సిందిగా టోకెన్లు అందిస్తున్నారు. ఈ శిబిరాలకు ఇద్దరు ప్రత్యేక వైద్య నిపుణులతోపాటు, పీహెచ్‌సీ వైద్యులు హాజరై సర్వేలో సిఫార్సు చేసిన రోగులను పూర్తి స్థాయిలో పరీక్షించి, ఉన్నత వైద్యం అవసరమైన వారిని జిల్లా ఆస్పత్రులకు పంపిస్తారు. అక్కడ వారికి మెరుగైన వైద్యం అందించనున్నారు.

విసన్నపేటలో అవగాహన

జమాదులపాలెం సచివాలయ పరిధి విసన్నపేట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై తాళ్లపాలెం పీహెచ్‌సీ సిబ్బంది సోమవారం ప్రజలకు అవగాహన కలిగించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్య సర్వేలో పాల్గొనాల్సిందిగా కోరారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎం. ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ స్మైలీ, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ తదితరులు ప్రజలతో మాట్లాడి, ఆరోగ్య సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు



తాళ్లపాలెంలో రైతులు, సిబ్బందితో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ అధికారి హేమసుందర్



జీవామృతం తయారీని పరిశీలిస్తున్న హేమసుందర్

కశింకోట: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార పంటలను పండించి ప్రజలకు అందించాలని ప్రకృతి వ్యవసాయ శాఖ ప్రాంతీయ అధికారి జి.హేమసుందర్ కోరారు. మండలంలోని తాళ్లపాలెం, జి.భీమవరం, రామన్నపాలెంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్లను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసే క్షేత్రాల్లో పంటలను పరిశీలించారు. రైతులు, సిబ్బందితో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఏటీఎం మోడల్ పంటలు పండించడం ద్వారా ఏడాది పొడవునా ఆదాయాన్ని పొందవచ్చునన్నారు. సుమారు 32 రకాల ఆకు కూరలు, కూరగాయలు, పప్పు దినుసులు, ఇతర పంటలను ఒకేసారి వేయడం ద్వారా ఏదో ఒక పంట ఫలసాయం ముందుగా రావడం, ఒకదాని తర్వాత ఒకటి రావడం ద్వారా నిత్యం ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ విధానంలో భూమి చుట్టూ ఐదు అడుగుల మేర గట్టు ఏర్పాటు చేసి, దానిపై వివిధ రకాల పండ్ల మొక్కల ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. మధ్యలో ఉన్న భూమిలో చిరు ధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు వగైరా పంటలు వేసుకోవడం ద్వారా నిరంతరం ఆదాయం వస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పంటలకు జీవామృతం వినియోగించడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. జీవామృతాన్ని పంటలకు తడులు పెట్టినప్పుడుగాని, పిచికారీ చేయడం ద్వారా గాని వినియోగించాలన్నారు. దీనివల్ల చీడ పీడలు తొలగి, పంటలు ఆరోగ్యంగా పెరుగుతాయన్నారు. భూమి సారవంతంగా ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు ప్రతి ఒక్కరూ శాశ్వత ప్రాతిపదికన ప్లాస్టిక్ డ్రమ్ములకు బదులు జీవామృతం తయారీకి సిమెంట్ కుండీలను పంట భూముల్లో నిర్మించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రాలను, జీవామృతం తయారీని పరిశీలించారు. ఆయన వెంట సిబ్బంది డి.రమణ, డి.వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధనలు.. ప్రత్యేక పూజలు



పెరుగుబజారు వద్ద అన్నసమారాధన ప్రారంభిస్తున్న పట్టణ సీఐ మోహన్‌రావు



వేల్పులవీధిలో భారీ అన్నసమారాధనలో భక్తులు

అనకాపల్లిటౌన్: పట్టణంలోని పలు వినాయక మందిరాల వద్ద సోమవారం భారీ అన్నసమారాధన కార్యక్రమాలు జరిగాయి. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

- స్థానిక పెరుగుబజార్ జంక్షన్ వద్ద అనకాపల్లి బంగారు మర్చంట్స్, వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని పట్టణ సీఐ దాడి మోహన్‌రావు ప్రారంభించారు. అంతకు ముందు గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిదానాలకంటే అన్నదానం గొప్పదని, యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా దైవ భక్తిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొణతాల రాజేంద్ర, సభ్యులు బుద్ధ శ్రీనివాసరావు, విల్లూరి శ్రీనివాసరావు, మళ్ల దివాకర్, తలారి లక్ష్మీప్రసాద్, పీలా మోహనరావు, లింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక వేల్పులవీధి శ్రీసీతారామ దేవాలయం వద్ద ఏర్పాటు చేసి వినాయక నవరాత్రుల్లో భాగంగా గౌరీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో సుమారు 3 వేల మందికి అన్నసమారాధన జరిపారు.
- గవరపాలెం చినరామస్వామి కోవెల వద్ద ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రుల్లో భాగంగా పెంటకోట చంద్రరావు ఆధ్వర్యంలో రాత్రి అల్పాహార వితరణను మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ విల్లూరి పైడారావు ప్రారంభించారు. వేల మంది భక్తులు పాల్గొని, అల్పాహారాన్ని స్వీకరించారు.

వేంకటేశునికి ప్రత్యేక హోమాలు



హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

అనకాపల్లిటౌన్: స్థానిక దేవునిగుమ్మం వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాలు అత్యంత వేడుకగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం ఆలయ బేడా మండపంలో స్వామివారికి ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి సుప్రభాత సేవ, అర్చనలను అర్చకులు పులఖండం గిరిబాబు, విజయబాబులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సకలా రాజ్యలక్ష్మి, ఈవో ఆదినారాయణ, ధర్మకర్తలు శ్రీధరాల కోమలి, సుంకర వెంకటేశ్వరరావు, ఉమ్మిని పైడిరాజు, రాజాన లక్ష్మి, సూరిశెట్టి చినసన్యాసిరావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ పాలకవర్గం ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం అనంతరం కొత్త పాలకవర్గంతో అధికారులు, నాయకులు

అనకాపల్లిటౌన్: వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా టి.కామేశ్వరరావుతోపాటు, ఏడుగురు పాలకవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. సోమవారం రాత్రి ఆలయ ఆవరణలో నూతన పాలకవర్గం కొలువుతీరింది. గర్రెడ్డి నూకరాజు, ఒడిశెట్టి కనక, నిమ్మకాయల నాగమణి, కేవీఎస్ఆర్ఎస్ సుబ్రహ్మణ్యం, ద్రాక్షారపు లలిత, కె.శంకరరావు, మాజీ కోఆప్షన్ సభ్యుడు బీఎస్ ప్రకాశరావులచే ఆలయ ఈవో కె.ఆదినారాయణ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, యువజన విభాగం జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉగ్గిన అప్పారావు, బొండా వాసు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో బాలికల హైస్కూల్ హెచ్‌ఎం స్వర్ణకుమారి

కశింకోట: జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన స్థానిక బాలికల హైస్కూల్‌కి చెందిన ఆరుగురు విద్యార్థినులను సోమవారం అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరపున నిర్వహిస్తున్న ఈ పోటీల్లో జిల్లా స్థాయి ఖోఖో బాలికల జట్లకు అండర్–14, 17 కేటగిరీల్లో స్థానిక బాలికల హైస్కూల్ విద్యార్థులు చెరో ముగ్గురు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని అభినందిస్తూ హెచ్‌ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి జ్ఞాపికలను అందించి, సత్కరించారు. చదువుతోపాటు ఆటల్లోకూడా బాగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పీడీ పెంటకోట కమల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక బాలికల హైస్కూల్ నుంచి ఎంపికైన విద్యార్థులు లంకెలపాలెంలో సోమవారం నుంచి జరుగుతున్న జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి

అనకాపల్లిటౌన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీవీవీ సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో సోమవారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. దీన్‌దయాళ్ చిత్రపటానికి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీన్‌దయాళ్ ఆశయ సాధనకు కృషిచేస్తున్న మోదీ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కాశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను రద్దు చేసి, కాశ్మీర్ కూడా భారతదేశంలో అంతర్భాగమని చాటిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. మోదీ పాలనలో దేశంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, సీనియర్ నాయకుడు ఎస్.ఎస్.అప్పారావు, కర్రి రామకృష్ణ, సాయిరాం, మొల్లి వెంకటరమణ, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్: విద్యుత్ వైర్ల కింది భాగంలో జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం ఈ నెల 27న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ శాఖ అనకాపల్లి ఈఈ(ఆపరేషన్స్) కె.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి, ఇనుపకొట్టు నాగేశ్వరరావు రహదారి, పూడిమడక జాతీయ రహదారి జంక్షన్ వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. దీన్ని గమనించి, ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీల ర్యాలీ



పట్టణంలో ర్యాలీగా వెళ్తున్న అంగన్‌వాడీలు

అనకాపల్లి రూరల్: వేతనాలు పెంచి, పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ఆందోళన నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నెహ్రూచౌక్ కూడలి వరకు ర్యాలీ, మానవ హారం చేశారు. అనంతరం ఐసీడీఎస్ పీడీ కార్యాలయం వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగేశు, వీవీ రమణమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, వీవీ శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, మాణిక్యం, వరలక్ష్మి, డి.శ్రీనివాసరావులు పాల్గొన్నారు

లాభాల్లో అన్నపూర్ణ బ్యాంక్





సమావేశంలో మాట్లాడుతున్న దంతులూరి దిలీప్‌కుమార్, హాజరైన సంఘం సభ్యులు

అనకాపల్లిటౌన్: తుమ్మపాల పీఏసీఎస్(అన్నపూర్ణ బ్యాంక్) బ్యాంక్ అందరి సహకారంతో ఏటా లాభాల్లో నడుస్తోందని ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక గాంధీనగరం బ్యాంక్ ఆవరణలో సోమవారం జరిగిన మహాజనసభ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల అవసరాల నిమిత్తం బంగారు ఆభరణాలపై అతితక్కువ వడ్డీ(రూ.0.75పైసల)కే రుణాలు అందిస్తున్నామని, దీన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. రైతులకు కావాల్సిన అన్నిరకాల ఎరువులు 170 టన్నుల వరకు సరఫరా చేసిన ఘనత పీఏసీఎస్‌దేనన్నారు. సంఘం అధ్యక్షుడు పీడీ గాంధీ మాట్లాడుతూ సంఘం బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి లాభాల్లో నడిపిస్తున్నామని, ఈ ఏడాది రూ.5 లక్షల 19 వేలు లాభం వచ్చిందన్నారు. త్వరలోనే సభ్యులకు లాభాలు పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీపీ గొర్లి సూరిబాబుతో చర్చించి బ్యాంకుకు షాపింగ్ కాంప్లెక్స్ మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆడిట్ రిపోర్టు, బడ్జెట్‌ను సంఘం సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు సకలా సంతోష్, బొడ్డు దేవుడు, తుమ్మపాల పంచాయతీ అధ్యక్షుడు నాయుడు, 150 మంది సభ్యులు పాల్గొన్నారు.

సంగీత, సాహిత్యంలో గుర్తింపు



పాటల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: సంగీత సాహితీ ప్రపంచంలో అనకాపల్లికి ఇంద్రగంటి శ్రీనివాస్ ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తృతీయ వర్ధంతి పురస్కరించుకుని కల్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్, అబ్దుల్ కలాం సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పాటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధుర గాయకుడు బాలూకి అనకాపల్లితో, తమ కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలుగు వారి గాత్రం ఎక్కడ వినిపించినా అది బాలూ పాటేనని కొనియాడారు. ఆయన లేకపోయినా తన పాటల ద్వారా ఆయన మనకు అందించిన మధుర గాత్రం మన మనసుల్లో ఎప్పటికీ నిలిచే ఉంటుందన్నారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇంద్రగంటి అందిస్తున్న ప్రోత్సాహాన్ని అభినందించారు. అనంతరం పాటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో అకాడమీ చైర్మన్, సంగీత దర్శకుడు ఇంద్రగంటి శ్రీనివాస్, అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్‌కుమార్, సభ్యులు గంగలకుర్తి భాగ్యలక్ష్మి, 80వ వార్డు ఇన్‌ఛార్జి కొణతాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన



క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రామ్మోహన్‌రావు

అనకాపల్లిటౌన్: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, క్యాన్సర్ సోకిన రోగికి సకాలంలో వైద్యసేవలు అందిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని ఏఎంఏఎల్ కళాశాల విశ్రాంత రసాయనశాఖాధిపతి కె.రామ్మోహన్‌రావు అన్నారు. స్థానిక డీఏవీ స్కూల్లో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని, క్యాన్సర్ లక్షణాలు, చికిత్సా పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్యాన్సర్ కేసులు పెరుగుతుండటం బాధాకరమన్నారు. ప్రస్తుత జీవనశైలి, క్యాన్సర్‌పై నిర్లక్ష్య ధోరణి, అవగాహనా రాహిత్యమే కారణమన్నారు. క్యాన్సర్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. మహిళలకు వచ్చే గర్భాశయ, అండాశయ, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మీశారద, ఉపాధ్యాయులు దుర్గారాణి, డీఏ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల సమస్యలపై ఆర్డీవోకు వినతి



ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందిస్తున్న మాణిక్యం

అనకాపల్లిటౌన్: మహిళలకు రక్షణ కల్పించాలని, కరవు ప్రాంతాల్లో మహిళలకు ఉపాధిహామీ పథకం కింద పనులు కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం కోరారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఏజే చిన్నికృష్ణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. రేషన్ డిపోల ద్వారా ఇస్తున్న కందిపప్పు గత 4 నెలల నుంచి ఇవ్వడం లేదని, కందిపప్పు సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు దాకారపు వరలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా సీఎం జగన్



బీఆర్టీ కాలనీలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి రూరల్: రాష్ట్రంలో నవరత్నాలతోపాటు అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు నిరుపేదలకు ఆసరాగా ఉంటున్నాయని, తద్వారా సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కేరాఫ్ అడ్రస్‌గా మారారని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. సోమవారం మండలంలోని బీఆర్టీ కాలనీలో టిడ్కో గృహ సముదాయాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ జరుగుతున్న లబ్ధిదారుల జియో ట్యాగింగ్ ప్రక్రియను పరిశీలించి, మహిళలతో మాట్లాడారు. జియో ట్యాగింగ్ ప్రక్రియ చాలా నెమ్మదిగా జరుగుతోందని కొందరు లబ్ధిదారులు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా రత్నాకర్ అక్కడ సిబ్బందితో మాట్లాడి ప్రక్రియ ఆలస్యంగా జరగడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో ఇంటర్నెట్ సహా నెట్‌వర్క్ సిగ్నల్స్ సరిగ్గా అందకపోవడం వలన సమస్య వస్తోందని సిబ్బంది తెలిపారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని సూచించారు. లబ్ధిదారులెవరూ ఆందోళన చెందవద్దని, జియో ట్యాగింగ్ పూర్తి చేసి ఎవరి ఇళ్లను వారికి అప్పగించే ప్రక్రియ ప్రభుత్వం చేస్తోందన్నారు.

ఫార్మాసిస్టుల సేవలు వెలకట్టలేనివి

ఫార్మాసిస్టులు ప్రజలకు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని దాడి రత్నాకర్ అన్నారు. ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం సందర్భంగా సోమవారం బీఆర్టీ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఏటా క్రమం తప్పకుండా ఇక్కడ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్న గ్రామస్తులు, ఆస్పత్రుల యాజమాన్యాలను అభినందించారు. ఫార్మాసిస్టుల సేవలను కొనియాడారు. అనంతరం వైద్య శిబిరంలో పలువురికి కంటి వైద్య పరీక్షలు సహా, పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనకాపల్లి సత్యదేవ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ భీశెట్టి సత్యవతి, మొల్లేటి శివాజీ, బొడ్డుపాటి చిన రాజారావు, దాడి రాము, మేడిశెట్టి సత్తిబాబు, శిలపరశెట్టి బాబీ, పీలా సంతోష్, భీశెట్టి తాతారావు, పోలిశెట్టి ఈశ్వర్రావు, బుద్ధ మోహనరావు, దొడ్డి కృష్ణ భగవాన్, చిన్న, బుద్ధ సత్యనారాయణ, దాడి రామకోటి, మారిశెట్టి రాము, ఓమాల కాశీ, ఇంటి త్రినాథ్, నందవరపు కుమార్, రేబాక ఇంద్రకుమార్ పాల్గొన్నారు.